# జాతిని చైతన్యవంతం చెయ్యాలంటే!......

ఆ జాతీయులు దాస్యస్వభావులు – పిరికివారు – యీర్ష్యా భూయిష్టులు –స్వార్థపరులు – రోగిష్టులు –

యిందుకు కారణం ఏమై వుంటుందో యెవరైనా చెప్పగలరా?

ఆం ఒకటై వుంటుంది.

ఆ జాతిలో స్త్రీ జనం – జాతినికని, అయిదేళ్ళ వరకూ పెంచే స్త్రీ జనం – దాస్య స్వభావులూ, పిరికివారూ, యీర్ష్యా భూయిష్టులూ, స్వార్థపరులూ, రోగిష్టులూ అయి వుంటారు. ఆ జాతిని సంస్కరించ దలచుకుంటే స్త్రీ జనంను ముందు సంస్కరించాలి. పురుషులు – కనీసం వారి సంతతి క్షేమాన్నీ, జాతి క్షేమాన్నీ ఆలోచించయినా తమ స్త్రీలను స్వతంత్రులుగానూ, ధైర్యస్థులుగానూ, ఆరోగ్యవంతులుగానూ తయారు చేయాలి.

★ ★ ★

ఆ ప్రజల్లో ఆత్మగౌరవం, ధైర్యం, సమభావం, త్యాగం, ఆరోగ్యం కానరావు.

యిందుకు కారణం ఏమయి వుంటుందో యెవరైనా చెప్పగలరా?

ఆం ఒకటై వుంటుంది.

ఆ జాతిని ఐదు నుండి పదహారేండ్ల వరకూ తొలిరూపులు దిద్దే ఉపాధ్యాయుడు – అస్వతంత్రుడుగానూ, భయస్తుడుగానూ, కక్కుర్తి స్వభావుడుగానూ, అజ్ఞానిగానూ అణచి పెట్టబడి వుంటాడు. యే అచ్చులో పోస్తే ఆ మూర్తే దిగుతుంది. ఆ జాతిని సంస్కరించదలచుకుంటే ప్రజలూ, ప్రభుత్వమూ కూడా ముందుగా ఉపాధ్యాయులు స్వతంత్రులూ, ధైర్యస్తులూ, సంపన్నులూ, జ్ఞానతృష్ణాపరులూ అయేటట్లు చూడాలి.

★ ★ ★

ఆ దేశంలో పాలకులు బిరుదరాయుళ్ళై, పదవీవ్యామోహపరులై, స్వార్థ భూయిష్టులై దేశాన్ని యధేచ్ఛగా పాలించగలుగుతున్నారు.

యిందుకు కారణం ఏమైవుంటుందో యెవరైనా చెప్పగలరా?

ఆం ఒకటై వుంటుంది.

ఆ దేశంలో ప్రజలు మూర్ఖులూ, అజ్ఞానులూ అయి వుంటారు. విజ్ఞాన వంతులైన కొద్దిమంది యువకులుంటే వారు కార్యశూరత్వం లేక ఒట్టి వాచాలురై వుంటారు. ఆ దేశ పాలన రామరాజ్యం కావాలంటే దేశభక్తులైన యువకుడు కొద్ది త్యాగానికి సిద్ధపడి, ఉపాధ్యాయత్వాన్నంది పల్లెల్లోనూ, పట్టణాల్లోనూ ప్రవేశించి నిర్బంధ విద్యా విధానం ద్వారా భవిష్యత్ ప్రజానీకాన్ని; వయోజన విద్య ద్వారా ప్రస్తుత ప్రజానీకాన్నీ మేల్కొల్పాలి. రామరాజ్య నిర్మాణానికి ఎటువంటి సంస్కృతి అవసరమో అట్టివానిని సాధించాలి. ఇదే యేకైకోత్తమ మార్గం.

★ ★ ★

ఆ దేశంలోని విద్యాధికుల్లో కూడా పైదేశాల నిరక్షరాస్యుల్లో వుండేపాటి సంస్కృతైనా కానరాదు.

ఇందుకు కారణం ఏమై వుంటుందో ఎవరైనా చెప్పగలరా?

ఆం ఒకటై వుంటుంది.

ఆ దేశంలో బ్రతుకుతెరవులేని అవ్యర్థులు బడిపంతుళ్ళై వుంటారు. పండిన ధాన్యంలో పొల్లుగింజలు విత్తనాలుగా జల్లుతే యేమవుతుంది? విద్యా విధానాన్ని పాలకవర్గం – అది నిఖార్సయిన ప్రజా ప్రతినిధి వర్గమైతే తప్ప – అవసరమైన పద్ధతిలో సంస్కరించడానికి ఎన్నడూ ఆసక్తి చూపించదు. ప్రజలు ముఖ్యంగా విజ్ఞానవంతులైన యువకులు – ముందుకు వచ్చి – సహాయపడాలి. విజ్ఞానవంతులు ఉపాధ్యాయ వృత్తి స్వీకరించాలి. వారొక విషయం జ్ఞాపకం పెట్టుకోవాలి. తాను తదితర వృత్తులలో ప్రవేశిస్తే తన ఉపాధ్యాయ స్థానం యింకొక అనర్హునకు విడిచి పెట్టడం ద్వారా ప్రతి సంవత్సరం సుమారు ముప్పై నలభై మంది బాలకులకు భవిష్యత్ప్రజానీకానికి – తీరని అపచారం చేస్తున్నట్లు గుర్తించాలి. అంతకు మించిన దేశద్రోహం మరి ఒకటి లేదని తెలుసుకోవాలి. ★

*(ఆనందవాణి: ఫిబ్రవరి 1948)*